క్లుప్తంగా

వేమన మందిరంలో రెడ్డి వివాహ పరిచయ వేదిక



మాట్లాడుతున్న వేమన సంక్షేమ సంఘం అధ్యక్షుడు వివేకానందరెడ్డి

సీతమ్మధార: ఆశీలుమెట్టలో గల వేమన మందిరంలో రెడ్డి ఉచిత వివాహ పరిచయ వేదిక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద త్తున విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, ఈస్టు గోదావరి జిల్లాల నుంచి రెడ్డి కుటుంబాలు పాల్గొన్నాయి. వధువు, వరుడు, వారి కుటుంబ సభ్యుల వివరాలు, ఫొటోలు ఈ సందర్భంగా సేకరించుకున్నారు. వేమన సంక్షేమ సంఘం అధ్యక్షుడు నీలాపు వివేకానందరెడ్డి మాట్లాడుతూ ఉచిత రెడ్డి వివాహ పరిచయ వేదిక నిరంతర సేవలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి, కోశాధికారి ఎస్.బాలిరెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు నీలాపు రమణారెడ్డి, పులగం సూర్యనారాయణరెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అరకొర మరమ్మతులతో అవస్థలు



మరమ్మతు తర్వాత మరింతగా శిథిలమైన యూజీడీ

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు రామకృష్ణా జంక్షన్ వద్ద కొన్నేళ్లుగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ శిథిలమై మురుగు నీరు రహదారిపై ప్రవహిస్తోంది. అలా చాలా కాలం కావడంతో అక్కడ పెద్దపెద్ద గోతులు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాద చారులు, ద్విచక వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ సమస్యపై పత్రికల్లో పలుమార్లు వార్తలు కూడా ప్రచురితం అయ్యాయి. దాంతో ఎట్టకేలకు జీవీఎంసీ అధికారులు స్పందించి రోడ్డుపై గోతులకు మరమ్మతు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. కానీ పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా మరమ్మతు చేయడంతో ఆ గోతులు మళ్లీ శిథిలమై మునుపటి కంటే మరింత ప్రమాదకరంగా తయారయ్యాయి. గతంలో కంటే మరింత ఎక్కువగా పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నిర్వాకం చూసిన స్థానికులు మండిపడుతున్నారు. ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే గొయ్యిలా ఉన్న యూజీడీ పెద్ద అగాథంలా మారిందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి యూజీడీకి పూర్తిస్థాయిలో మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

హామీలు నెరవేర్చేందుకు ప్రణాళికలు సిద్ధం



ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

అల్లిపురం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ప్రణాళికలు సిద్ధమని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన 34వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా కొబ్బరితోట, భూపేష్‌నగర్, నేతాజీనగర్, లక్ష్మీదేవిపేట తదితర ప్రాంతాల ప్రజలు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు.
వార్డులో కొబ్బరితోటలో సచివాలయం పక్కన సామాజిక భవనం నిర్మించాలని, యూజీడీ కనెక్షన్లకు అనుమతివ్వాలని విన్నవించుకున్నారు. పర్యటనలో అతనితో పాటు జోన్–4 జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, అధికారులు, స్థానిక నాయకులు వాసుపల్లి నరేష్, రామ్ కుమార్, ఏపీడీ తదితరులు ఉన్నారు.

నిఘా నేత్రాలకు.. రక్షణ కరవు

- బంగారమ్మమెట్టపై సీసీ కెమెరాలు ధ్వంసం
- పెచ్చుమీరుతున్న ఆకతాయిల ఆగడాలు
- భద్రతపై స్థానికుల ఆందోళన
- పట్టించుకోని పోలీసులు

నేర నియంత్రణలో సమర్థవంతంగా పని చేసే సీసీ కెమెరాలను అల్లిపురంలోని బంగారుమెట్టలో పోలీసులు కొన్నాళ్ల క్రితం అమర్చారు. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే వారి ఆనందం ఎంతో కాలం నిలవలేదు. ఎందుకంటే వాటిని ఆకతాయిలు ధ్వంసం చేసేశారు. మద్యం, గంజాయి వంటివి ఆ ప్రాంతంలో గల ఖాళీ ఆటోల్లో కూర్చుని తాగేందుకు వీలుగా వారు ఈ పని చేశారు. వారిని ప్రశ్నించే ధైర్యం లేక స్థానికులు మిన్నకుండిపోయారు. ధ్వంసమైన సీసీ కెమెరాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని పోలీసులను స్థానికులు కోరగా ఎటువంటి ఫలితం కనిపించలేదు.



అల్లిపురంలోని బంగారుమెట్ట జంక్షన్



పని చేయని సీసీ కెమెరాల కంట్రోల్ యూనిట్

అల్లిపురం: భద్రత కల్పించాల్సిన నిఘా నేత్రాలకే రక్షణ కరవయింది. ఆకతాయిలు తమ ఆగడాలకు అడ్డుగా ఉన్న సీసీ కెమెరాలను విరగ్గొట్టడంతో బంగారుమెట్ట వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ఈ ప్రాంతంలో టూటౌన్ సీఐ బి.తిరుమలరావు వీటిని ప్రారంభించారు. వాటి కంట్రోల్ యూనిట్ కూడా స్థానికంగా గల శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజంలో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి సక్రమంగానే ఇవి పని చేసేవి. సీసీ కెమెరాలు బిగించడంతో ఆకతాయిలు తమ కార్యకలాపాలకు అడ్డం వస్తున్నాయని పలుమార్లు వాటి వైర్లు కట్ చేశారు. ఈ విషయమై పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా వాటికి మరమ్మతు చేయలేదు కదా మీరే వాటిని రిపేరు చేసుకోవాలని స్థానికులకు తెలియజేయటంతో అవాక్కవ్వడం వారి వంతయింది.

అదుపు లేని ఆకతాయిల ఆగడాలు..

బంగారుమెట్ట ప్రాంతంలో ఆకతాయిల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో జంక్షన్‌లో ఆగి వున్న ఆటోల్లో ఆకతాయిలు చేరి మద్యం సేవిస్తూ అందరినీ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జంక్షన్‌లో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పక్క సందులో గంజాయి మూకలు కూడా చేరి అల్లరి చేస్తున్నారని వాపోతున్నారు. వారిని ప్రశ్నిస్తే దాడులకు పాల్పడతారని స్థానికులు వాపోతున్నారు.

పోలీసులు చర్యలు తీసుకోవాలి..

ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలు లేకపోవటంతో తాము బాగా ఇబ్బందిపడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఆకతాయిలు ఆగడాలు పెరిగిపోతున్నాయని వాపోతున్నారు. భవిష్యత్‌లో ఎటువంటి సంఘటనలు జరగక ముందే పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.







పని చేయని సీసీ కెమెరాలు

చీకటి పడితే భయమేస్తుంది..



చీకటి పడితే చాలు బయట తిరగాలంటే భయమేస్తుంది. రాత్రి 9 గంటల నుంచి ఎక్కడెక్కడి నుంచో ఆకతాయిలు ఇక్కడ చేరుతున్నారు. నిలిపి ఉన్న ఆటోల్లో మద్యం, గంజాయి తాగుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. అడిగితే దాడులకు దిగుతారేమోనని భయంతో ఉంటున్నాం. ఇక్కడ ఉన్న సీసీ కెమెరాలు పగులగొట్టేశారు.

– భీమరశెట్టి అప్పారావు, బంగారుమెట్ట

సీసీ కెమెరాలు విరగ్గొట్టారు..



స్థానికంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు విరగొట్టారు. కొన్ని కెమెరాలు ఎత్తుకెళ్లిపోయారు. తమ ఆగడాలకు అడ్డువస్తున్నాయని ఇలా చేశారు. పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు లేవు. తక్షణమే సీసీ కెమెరాలకు మరమ్మతు చేయాలి. అలా అయినా ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట పడుతుంది.

– పీల మహేశ్వరరావు, బంగారుమెట్ట

మహిళలు ఇబ్బంది పడుతున్నారు..



రాత్రి 7 దాటితే ఆడవాళ్లు, చిన్న పిల్లలు బయటికి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. సీసీ కెమెరాలు లేకపోవటంతో ఆకతాయిలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. మద్యం తెచ్చుకుని ఆటోల్లో తాగుతున్నారు. చీకటి పడితే మగవారే బయటకు వచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారు. పోలీసులు తక్షణం సీసీ కెమెరాలు రిపేరు చేయిస్తే మంచిది.

– ఆదారి వెంకటరావు, బంగారుమెట్ట

• మంత్రి పర్యవేక్షణలో తూతూమంత్రంగా పనులు



లక్ష్మీ టాకీస్ జంక్షన్‌లో రోడ్డు మరమ్మతుల పేరిట తూతూమంత్రంగా పనులు చేశారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దగ్గరుండి ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టారు. అనంతరం ఫొటోలు కూడా దిగారు. అయితే రోడ్డు మీద కొద్దిగా సిమెంట్ వేసి అలాగే వదిలేశారని, వర్షం కురిస్తే సిమెంట్ మొత్తం కొట్టుకుపోతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

పర్యాటక ప్రాంతాల్లో సహజసిద్ధమైన పుట్టలు



ముడసర్లోవ పార్కులో పాముల పుట్ట

ఆరిలోవ: పలు పర్యాటక ప్రాంతాల్లో సహజసిద్ధమైన పుట్టలు కోకొల్లలుగా ఉన్నాయి. సాధారణంగా నాగులచవితి పర్వదినాన భక్తులు నాగన్నకు పూజలు చేస్తుంటారు. ఈ నెల 5న నాగులచవితి సందర్భంగా భక్తులు సిద్ధమవుతున్నారు. నగరంలోని నివాసాల మధ్య కృత్రిమ పుట్టలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. అందుబాటులో ఉన్న వారు వాటి వద్దే పూజలు చేస్తుంటారు. ఆరిలోవ, ముడసర్లోవ, విశాఖ వ్యాలీ, హనుమంతవాక, జోడుగుళ్లపాలెం, రైల్వేక్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో పుట్టలను అధికారులు శుభ్రం చేయించారు. భక్తులు వాటి వద్ద నాగన్నకు పూజలు చేసుకోవడానికి వీలుగా శుభ్రం చేసి, దారులు ఏర్పాటు చేశారు.

టీఎస్సార్ షెల్టర్‌కు విజయనగరం జిల్లా వాసి



టీఎస్ఆర్ షెల్టర్‌లో సోమినాయుడు

సీతమ్మధార: విజయనగరం జిల్లా గుర్ల మండలం కొత్తపేట గ్రామానికి చెందిన సోమినాయుడు (60) విశాఖ రైల్వేన్యూ కాలనీలో ఉంటున్న కుమార్తె వద్దకు వచ్చాడు. శస్త్రచికిత్స చేయించుకున్న సోమినాయుడు అల్లుడు, కుమార్తె దగ్గరకు వచ్చినప్పటికీ వారికి తాను భారమైపోయానని భావిస్తూ ఆదివారం బయటికి వచ్చేశాడు. అతను రైల్వేస్టేషన్‌లో ఉండగా ఆర్‌పీఎఫ్ సీఐ రామకృష్ణ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో కానిస్టేబుల్ మీసాల అప్పలనాయుడు సోమినాయుడిని టీఎస్సార్ షెల్టర్‌కు అప్పగించారు. ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు, నందూరి శ్రీనివాస్ తదితరులు అతనికి ఆశ్రయం కల్పించారు.

ఏఎస్‌ఆర్‌నగర్‌లో అగ్నిప్రమాదం



బాధిత మహిళతో మాట్లాడుతున్న సిబ్బంది, నాయకులు

కంచరపాలెం : జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం ఏఎస్ఆర్ నగర్ 281వ నంబరు సచివాలయం పరిధిలో ఓ ఇంట్లో ఆదివారం ఉదయం ఆకస్మికంగా అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. సంఘటనా స్థలానికి మర్రిపాలెం ఆగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలు అదుపు చేశారు. ఇంట్లో సామగ్రితోపాటు విద్యుత్ వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న వార్డు కార్పొరేటర్ గంకల కవిత, సచివాలయ సిబ్బంది బాధిత మహిళ వెంకటలక్ష్మిని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం బాధిత మహిళకు కార్పొరేటర్ గంకల కవిత రూ.5 వేల నగదు అందించారు. వార్డు నాయకులు అప్పారావు, మహేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) విశాఖ సిటీ నూతన కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. 12 పదవులకు ఒక్కో నామినేషన్ రావడంతో ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్టు జిల్లా ఉపాధ్యక్షుడు, ఎన్నికల అధికారి పి.శ్యామ్‌ప్రసాద్, జిల్లా బ్రాంచ్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శి, అసిస్టెంట్ ఎన్నికల అధికారి కె.అనిల్‌కుమార్ యాదవ్ తెలిపారు. విశాఖ సిటీ అధ్యక్షుడిగా బీవీఎస్ఎస్ నియోగి (స్పెషల్ డిప్యూటీ తహసీల్దార్, యూఎల్‌సీ), కార్యదర్శిగా బి.రవిశంకర్ (డిప్యూటీ తహసీల్దార్), అసోసియేట్ అధ్యక్షులుగా పీయూఎస్ ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా వీవీఎస్‌వీ వరుణ్, బి.సతీష్, ఎం.భవానీ, సంయుక్త కార్యదర్శులుగా జె.ఎస్.వి.వి.ఎస్.మూర్తి, పీవీ రవివర్మ, కె.లక్ష్మణరావు, కోశాధికారిగా వీఎస్ఆర్ కృష్ణ ముళ్లపూడి, కార్యవర్గ సభ్యులుగా డి.రామకృష్ణ, ఆర్.వరలక్ష్మి ఎన్నికయ్యారు. కార్యవర్గాన్ని ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు త్రినాథరావు, కార్యదర్శి సీహెచ్‌వీ వర్మ, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డి.రాజేంద్రవర్మ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.వేణుగోపాల్, కోశాధికారి జి.రాజేష్ తదితరులు అభినందించారు.



ఏపీఆర్ఎస్ఏ విశాఖ సిటీ నూతన కార్యవర్గంతో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు త్రినాథ్, రమేష్

డివిజన్ బ్రాంచి సైతం ఏకగ్రీవం

ఏపీఆర్ఎస్ఏ విశాఖ డివిజనల్ బ్రాంచి కార్యవర్గ ఎన్నిక కూడా ఏకగ్రీవమైంది. అధ్యక్షుడిగా పి.నవీన్‌రాజా (డీటీ, ములగాడ), కార్యదర్శిగా ఎస్‌వీకే చైతన్య (ఆర్ఐ, మహారాణిపేట), అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం.మహేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా బి.మధుకుమార్, వి.సురేష్ యాదవ్, జి.రమ, సంయుక్త కార్యదర్శులుగా ఎస్.మృదుల, జేవీఎస్ చంద్రశేఖర్, జె.శివశంకర్, కోశాధికారిగా కె.నగేష్, కార్యవర్గ సభ్యులుగా హుస్సేన్ బేగ్, కె.కోమలి తదితరులు ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి పీఆర్ఎస్ఏ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.వేణుగోపాల్ తెలిపారు.

చిన్న పిల్లలకు స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయాలి

డాబాగార్డెన్స్: రాష్ట్ర విభజన నేపథ్యంలో మన రాష్ట్రంలో చిన్న పిల్లలకు ప్రత్యేక స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని, అది నీలోఫర్ స్థాయి స్పెషాలిటీ ఆస్పత్రిగా ఉండాలని ప్రజారోగ్య వేదిక డిమాండ్ చేసింది. ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి విమ్స్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని, కేజీహెచ్, వీజీహెచ్‌లో విభాగాల సంఖ్య పెంచి, మౌలిక వసతులు కల్పించి, సిబ్బంది సంఖ్య పెంచాలని డిమాండ్ చేసింది. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా మౌలిక వసతులు, సిబ్బంది సంఖ్య పెంచాలని సమావేశంలో ప్రభుత్వాన్ని కోరారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ప్రజారోగ్య వేదిక విస్తృత సమావేశం నిర్వహించింది. ముందుగా ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. కామేశ్వరరావు గత నాలుగేళ్లలో సంస్థ చేపట్టిన కార్యక్రమాలు వివరించారు. ఎకనామిక్స్ ప్రొఫెసర్ పద్మ మాట్లాడుతూ విద్య, వైద్యం రెండూ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలన్నారు. డాక్టర్ ఎన్ఎస్ రాజు మాట్లాడుతూ ప్రజారోగ్యం ప్రభుత్వాల బాధ్యత అనే నినాదం ప్రకారం ప్రజారోగ్య వేదిక కార్యక్రమాలు నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. డాక్టర్ వైఎల్ నరసింగరావు మాట్లాడుతూ ప్రజారోగ్య వేదికను ప్రతి రంగంలోకి తీసుకెళ్లాలని, తద్వారా ప్రజలకు చేరువ కావాలని సూచించారు. డాక్టర్ పి. రామారావు మాట్లాడుతూ ప్రజారోగ్యం బాధ్యతను ప్రభుత్వం తప్పించుకుని ప్రైవేట్ రంగానికి అప్పగించడం బాధాకరమని, ఇది భవిష్యత్‌కు ప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ సంస్థ ప్రతినిధి అష్రాఫ్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు మురళీధర్, కేవీపీ చంద్రమౌళి, డాక్టర్ శ్రీనివాస్, సంజయ్‌కుమార్, సురేష్, కళాధర్‌తో పాటు మిడ్డే మీల్స్, ఆశ, అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ నాయకులు పి. మణి, మహేష్, శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజారోగ్య వేదిక ప్రతినిధి

పార్కింగ్ అస్తవ్యస్తం

- ఎక్కడ పడితే అక్కడే వాహనాల నిలిపివేత
- కానరాని ట్రాఫిక్ పోలీసులు
- కొనుగోలుదారులు, స్థానికులకు ఇబ్బందులు



సీతమ్మధార రైతుబజార్ సమీపంలో అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసిన వాహనాలు



రైతుబజారు ఎదుట పార్కింగ్ చేసిన వాహనాలు

సీతమ్మధార : నగరంలోనే పెద్దదైన సీతమ్మధార రైతుబజార్ పరిసరాల్లో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. బజారుకు వచ్చే వాహనదారులు ఇష్టారాజ్యంగా రోడ్లపైనే వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలకు మార్గం ఇరుకుగా మారిపోతోంది. వాహనదారులు ఇబ్బంది పడుతున్నా, ట్రాఫిక్ కష్టాలు పెరిగిపోతున్నా సంబంధిత పోలీసులు మాత్రం కనీస చర్యలు చేపట్టడం లేదు. సీతమ్మధారలో 1999లో రైతుబజార్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి బజార్‌లో రోజూ ఉదయం పూట 140 మంది రైతులు, సాయంత్రం 60 మంది కూరగాయలు విక్రయిస్తారు. రోజూ ఈ బజారులో సగటున ఐదు టన్నుల మేర కూరగాయలు విక్రయిస్తారు. ఇక్కడకు సీతమ్మధార, కేఆర్ఎం కాలనీ, గాంధీనగర్, పీ అండ్ టీ కాలనీ, బాలయ్యశాస్త్రి లే అవుట్, రాధాకృష్ణ లే అవుట్, మద్దిలపాలెం, భానునగర్, హెచ్‌బీ కాలనీ, ఎంఎంటీసీ కాలనీ, పాత వెంకోజీపాలెం, పాత, కొత్త రేసపువానిపాలెం, సత్యం జంక్షన్, నక్కవానిపాలెం, గురుద్వారా, శాంతినగర్, సీతంపేట తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది కూరగాయలు కొనుగోలు నిమిత్తం వస్తుంటారు. కానీ వారందరికీ పార్కింగ్ ప్రాంతం లేకపోవడంతో బజారుకి రెండు వైపులా రోడ్డు మీదనే వాహనాలు నిలిపేయాల్సిన పరిస్థితి నెలకొంది. బజారు బయట ఒక వైపు తోపుడు బండ్లు, మరోవైపు వాహనాల పార్కింగ్ వల్ల ట్రాఫిక్ జామ్ అవుతోంది. ముఖ్యంగా పండగల సమయంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. ఈ మార్గంలోనే 69వ నంబర్ సిటీ బస్సులు రాకపోకలు సాగిస్తాయి. ఇంకా ఇతర వాహనాల రాకపోకలతో నిత్యం ఈ మార్గం రద్దీగా ఉంటుంది. అయినప్పటికీ ట్రాఫిక్ నియంత్రణకు ఎంవీపీ ట్రాఫిక్ పోలీసులు కనీస చర్యలు చేపట్టడం లేదు.

తప్పని అవస్థలు..

రైతుబజారు బయట దుకాణాలు, వాహనాల పార్కింగ్ కారణంగా ఈ రోడ్డులోనే గల ప్రభుత్వ వర్కింగ్ ఉమెన్ వసతిగృహానికి సిబ్బంది, ఉద్యోగినులు రాకపోకలు సాగించడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. మరోవైపు బజారు లోపలికి వెళ్లేందుకు గల రెండు ప్రవేశద్వారాలకు అడ్డగా నేలపైనే దుకాణాలు, వాహనాల పార్కింగ్ ఆటంకంగా మారడంతో వినియోగదారులు బజారు లోపలికి, బయటకి రావడానికి అవస్థలు పడుతున్నారు. జిల్లా వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు తరచూ బజారు తనిఖీ నిమిత్తం ఇక్కడికి వస్తుంటారు. ఆ సమయంలో డిప్యూటీ డైరెక్టర్ లేదా అసిస్టెంట్ డైరెక్టర్ వచ్చే వాహనాలు నిలపడానికి కూడా ఇక్కడ పార్కింగ్ స్థలం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఏదో మారుమూల వాహనం నిలిపిన తర్వాత అధికారులు బజారు లోపలకి రావాల్సిన పరిస్థితి నెలకొంది. రైతుబజార్ సిబ్బంది, వ్యాపారులకు కూడా వాహనాల పార్కింగ్ పెద్ద సమస్యగా మారిందంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా సబ్సిడీపై టమాటా, ఉల్లి విక్రయాల సమయంలో వినియగదారుల సంఖ్య బాగా పెరుగుతోంది. ఆ సమయంలో వాహనాల పార్కింగ్ సమస్య వర్ణనాతీతం.